ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 16 | జూన్ | 2024

పేజీలు 8


## ఖమ్మం కలెక్టర్‌గా ముజామిల్ ఖాన్
## భద్రాద్రి కలెక్టర్‌గా జితిష్ వి పాటిల్





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కలెక్టర్ విపి గౌతమ్ బదిలీ అయ్యారు. మూడేళ్ల నుంచి ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న విపి గౌతమ్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ముజామిల్ ఖాన్ ను కలెక్టర్‌గా నియమించారు. ఆయన ఇప్పటి వరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ముజామిల్ ఖాన్ తండ్రి ఎకె ఖాన్ గతంలో రాష్ట్ర డిజిపిగా పని చేశారు. భద్రాద్రి

మిగతా 2లో..

# మార్క్సిజంతోనే పురోగమనం





**-సంస్థాగత నిర్మాణమే లక్ష్యంగా కార్యాచరణ**
**-శిక్షణా తరగతుల్లో కూనంనేని**
**-ప్రజా సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి : బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్క్సిజంతోనే దేశం పురోగమిస్తుంది తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తెలిపారు. కమ్యూనిజం అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. శిక్షణా తరగతుల్లో భాగంగా రెండవ రోజున ప్రస్తుత రాజకీయ పరిస్థితులు సిపిఐ అనే అంశాన్ని కూనంనేని బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పలు అంశాలు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని ప్రజల నిస్పష్ట అభిప్రాయం ఎన్నికల సందర్బంగా బహిర్గతం కావడం లేదని ఆయన

మిగతా 2లో..







**-పెట్టుబడిదారులదే పెత్తనం**
**- నానాటికీ దిగజారిపోతున్న దేశ ఆర్థిక స్థితిగతులు**
**- ప్రొ.యుగల్ రాయలు**
**-కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజలకు సమన్యాయం : సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలచేత ఎన్నోకబడిన పాలకులు దేశాన్ని నవ్వులపాలు చేస్తున్నారని, వారి కనుసన్నల్లో పెట్టుబడి దారులు పెరిగిపోయి పెత్తనం మొదలు పెట్టారని ప్రొ.యుగల్ రాయలు అన్నారు. నరాటి ప్రసాద్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా, మున్నా లక్ష్మీ కుమారి అధ్యక్షతన జరుగుతున్న సిపిఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో భాగంగా చివరి రోజు ఆయన నూతన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసం అనే అంశంపై మాట్లాడారు. దేశంలో వ్యవస్థ గాడితప్పుతోందని, పేదలు ఇంకా పేదలుగా, సంపన్నలు మరింత సంపన్నులుగా మారుతున్నారని చెప్పారు. సంపద కొందరి చేతుల్లోనే ఉందని, దాని ఫలాలు వారికి

మిగతా 2లో..



# పోలీస్ పహారా మధ్య భూ సర్వే





**-అడ్డుకున్న బాధితులు**
**-పోలీస్ స్టేషన్‌కు తరలింపు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలీస్ పహారా మధ్య నాగపూర్ నుండి అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చేపట్టిన భూ సర్వే తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. తమ అనుమతి లేకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారంటూ బాధిత రైతులు అడ్డుకున్నారు. అడ్డుకున్న బాధితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి సర్వే నిర్వహించి జెండాలు పాతారు. వివరాల్లోకి వెళితే... నాగపూర్ నుంచి అమరావతి

మిగతా 2లో..




# మార్క్సిజంతోనే పురోగమనం







(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. ప్రతి ఎన్నికల సందర్భంలోను ఏదో ఒక అంశం రాజకీయాలను ప్రభావితం చేసి గెలుపోటములను నిర్దేశిస్తుందన్నారు. ఒకసారి సానుభూతి ఓట్లు, మరోసారి మతపరమైన ఓట్లు కొన్ని పార్టీలను అధికారంలోకి తీసుకువస్తున్నాయన్నారు. పాలన పద్ధతులు పేద, అట్టడుగు వర్గాల సంక్షేమం, ఆర్థిక విధానాలు, అభివృద్ధి ఎన్నికల్లో దురదృష్టవశాత్తు ఎజెండా అంశాలుగా రావడం లేదన్నారు. సిద్ధాంతం లేకుండా కొన్ని బూర్జువా పార్టీలు పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంతం మాత్రమే ప్రజల అవసరాలను గుర్తిస్తుందన్నారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఇది తీవ్ర అశాంతికి దారి తీయడంతో పాటు ఆందోళన కలిగిస్తుందని కూనంనేని తెలిపారు. కమ్యూనిజం మాత్రమే ఈ దేశానికి ప్రత్యామ్నాయమని పార్టీని మరింత మరింత విస్తరించాల్సి ఉందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. యువతను పార్టీ వైపు ఆకర్షించాలంటే సంస్థాగత నిర్మాణం ప్రధానమైందని ఒకపక్క ఆందోళనలు, మరో పక్క సైద్ధాంతిక శిక్షణ, సైద్ధాంతిక ప్రచారం పార్టీని బలోపేతం చేయనున్నాయని ఆయన తెలిపారు. సువిశాల భారతదేశంలో కుల, మత, ఆర్థిక పరిస్థితులకు అతీతంగా ప్రజలందరినీ ఏక దృష్టితో చూడగలిగిన సిద్ధాంతం కమ్యూనిజం మాత్రమే అన్నారు. పార్టీ బలానికి అనుగుణంగా పోరాట కార్యక్రమం రూపొందించబడాలని ఆయన సూచించారు.

## ప్రజా సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి : బాగం

కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే కమ్యూనిస్టు పార్టీ విస్తరణ సాధ్యమవుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ తరహాలోనే ప్రజా సంఘాలు దైనందిన కార్యాచరణ రూపొందించుకుని అందుకు అనుగుణంగా పని చేయాలన్నారు. పార్టీ నిర్మాణం పై కేంద్రీకరించి కార్యక్రమాల రూపకల్పన జరిపి అమలు చేయాలని అప్పుడే పార్టీ విస్తరణ సాధ్యమవుతుందన్నారు. రెండవ రోజు సిపిఐ శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం పార్టీ నిర్మాణం నూతన సవాళ్లు అనే అంశాన్ని ఆయన బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్జువా పార్టీల విధానాలు అధికారం లక్ష్యంగా పనిచేస్తున్నాయని అధికారం కోసం ప్రజలను వంచిస్తున్నారని ఆయన తెలిపారు. అచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి రావడం, ఇచ్చిన హామీలను మరచిపోవడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలకు ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మరి కొంత కాలం బూర్జువా పార్టీలతో పొత్తు తప్పకపోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. అతి త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని గ్రామ పంచాయితీలు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, మున్సిపాలిటీలు, సొసైటీలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు.ప్రతి ఎన్నికలోను బలానికి అనుగుణంగా విజయం సాధించే దిశగా ఆలోచన చేయాలని హేమంతరావు కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో పార్టీ కార్యక్రమాలపై సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రసంగించగా శిక్షణా తరగతులకు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రిన్సిపాల్‌గా, శింగు నర్సింహారావు వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే దక్కుతున్నాయని చెప్పారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయని, పెద్దపెద్ద చదువులు చదువుకున్న వారు సైతం కొద్దిపాటి జీతాల కోసం కొలువులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. దేశభవిష్యత్ యువత పైనే ఆధారపడి ఉందని, అలాంటి యువత బ్రతుకులు గాల్లో దీపాలుగా మారిపోయాయని చెప్పారు. పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారన్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, ప్రపంచ ఆర్థిక సూచిలో భారతదేశం అడుగుభాగానికి చేరుతోందని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత ప్రజాశ్రేయస్సు కోసం ఆలోచించాల్సిన పాలుకులు ప్రతీ అంశానికి రాజకీయాలను ముడిపెట్టడం బాధాకరమని, మత,కుల ఆధారంగా పాలుకులు పావులు కదుపుతున్నారని, బడుగులు, బలహీలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. పేదల నుండి ముక్కు పిండి వసూళ్లు చేస్తూ అయిన వారికి కోటాను కోట్ల రుణ మాఫీలు చేస్తున్నారని ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు.

## కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజలకు సమన్యాయం : సాబీర్ పాషా

దేశం భవిష్యత్‌కు కమ్యూనిస్టుల అవసరం ఉందని మేధావులు ఒప్పుకుంటున్నారని, కమ్యూనిస్టులు దేశంలో బలపడితేనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. నరాటి ప్రసాద్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా, మున్నా లక్ష్మీ కుమారి అధ్యక్షతన జరుగుతున్న సిపిఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో భాగంగా చివరి రోజు ఆయన మాట్లాడారు. మతం పేరిట రాజకీయాలు సరైనవి కావని దేశ ప్రజలు చెప్పకనే చెప్పారని, దేశంలో బిజెపికి 400 లకు పైగా సీట్లు వస్తాయని భావించినప్పటికీ చతికల పడ్డారని, మతాధరంగా చేసే రాజకీయాలు తాత్కాలికమే అని అన్నారు. సబ్‌కీ సాత్ సబ్‌కీ వికాస్ అనే నినాదాన్ని పదేపదే చెప్పే మోడి ఆచరణలో మాత్రం సొంత ఎజెండాను పాటిస్తూ కార్పోరేట్‌లకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టు ప్రస్తుత డిజైన్‌తో జిల్లాకు పెద్దగా ఒరిగిందేమీ లేదని, ఈ పాలకులైనా దాని డిజైన్ మార్చి పంట పొలాలకు గోదావరి జలాలు అందించాలన్నారు. గత పాలకుల వైఫల్యంతో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, వాటిని ఈ ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామని, సమస్యలు పరిష్కరించకుంటే ప్రశ్నించక మానమన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం వెంకటేశ్వరరావు, చలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, చంద్ర నరేంద్రకుమార్, దేవరకొండ శంకర్, మండల, పట్టణ కార్యదర్శులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అడుమిల్లి సాయిబాబా, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, భుక్యా ధస్రు, డి సుధాకర్, పద్మానాభరాజు, గుగులోత్ రామచందర్, బంధం నాగయ్య, బొర్రా కేశవులు, జి.రామకృష్ణ, ఉయికే నారాయణ, ఎండి యూసఫ్, పి సతీష్, ధర్మ, వాగబోయిన రమేష్, అనంతనేని సురేష్, మువ్వ వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# పోలీస్ పహారా మధ్య భూ సర్వే






(మొదటిపేజీ తరువాయి)

వరకు నిర్మించే జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఖమ్మం అర్బన్ పరిధిలోని బల్లేపల్లి రెవెన్యూలో, రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రెవెన్యూలో, చింతకాని మండల పరిధిలోని వందనం రెవెన్యూ పరిధిలో భూసేకరణకు సంబంధించి శనివారం సర్వే చేపట్టారు. రెవెన్యూ, జాతీయ రహదారుల సంస్థ అధికారుల ఆధ్వర్యంలో నాలుగు బృందాలు పోలీస్ పహారా మధ్య సర్వే చేపట్టారు. సర్వే చేస్తున్నారన్న సమాచారం అందుకున్న బాధితులు ఆ ప్రాంతానికి వచ్చి సర్వేను అడ్డుకున్నారు. తమ అనుమతులు లేకుండా భూ సర్వే చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని అవసరం లేకపోయినా జాతీయ రహదారుల నిర్మాణం పేరుతో తీసుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికే ఖమ్మంలో పలు జాతీయ రహదారులు నిర్మాణమవుతున్నాయని వాటికి ఈ రహదారిని అనుసంధానం చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సర్వేను అడ్డుకోవడంతో కొంత సేపు వైరా రోడ్డు ప్రధాన రహదారిపై ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సర్వే నిర్వహించారు. నాగపూర్ నుంచి అమరావతికి నిర్మించే జాతీయ రహదారికి సంబంధించి 150 అడుగుల విస్తీర్ణం మేర సర్వే నిర్వహించి జెండాలు పాతారు. ఖమ్మం అర్బన్ పరిధిలోని బల్లెపల్లి నుంచి వి. వెంకటాయపాలెం మీదుగా వందనం రోడ్డు కృష్ణా వెంచర్ వరకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. గతంలో 200ల అడుగులకుపైగా రోడ్డు నిర్మాణానికి సర్వే చేయగా దానిని 150 అడుగులకు తగ్గించారు. వి. వెంకటాయపాలెం శివ దాబా వద్ద 300 అడుగుల మేర భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. గత కొంత కా లంగా ఈ రహదారి నిర్మాణం నమూనా మారుతుందని బాధితులు ఆశగా ఎదురు చూశారు. ఇప్పుడు సర్వే చేయడంతో రహదారి నిర్మాణంలో ఎటువంటి మార్పులు ఉండవని తెలుస్తుంది. ఈ సర్వేలో తహసీల్దార్లు స్వామి, లుథర్ విల్సన్,సిఐలు పాల్గొన్నారు.

# ఖమ్మం కలెక్టర్‌గా ముజామిల్ ఖాన్

# భద్రాద్రి కలెక్టర్‌గా జితిష్ వి పాటిల్

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రియాంక ఆలా ను బదిలీ చేస్తూ ఆమె స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా జితిష్ వి పాటిల్‌ను నియమించారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. భద్రాచలం ఐటిడిఏ పివోగా ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఖమ్మం అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న బి. సత్యప్రసాద్‌ను జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు.

# విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జారే

**ప్రజాపక్షం/దమ్మపేటః** స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా దమ్మపేట పట్టణ కేంద్రానికి చెందిన ప్రగడరాజు వెంకటేశ్వరరావు హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ లో ట్రీట్మెంట్ జరుగుతుండగా, ఆర్థిక పరిస్థితి బాగా లేనందువలన ఎమ్మెల్యే జారే ని సంప్రదించగా వెంటనే ఎల్ ఓసి క్రింద 1,55,000 రూపాయిలు మంజూరు చేయించి స్వయంగా వారి ఇంటికి వెళ్లి ఎల్ఓసి పత్రాన్ని పేషెంట్ కు అందజేశారు. అనంతరం మందలపల్లి విశ్రాంతి ఉద్యోగి, ఎంతో మందికి విద్యార్థులకి విద్య బోధన చేసిన సదాశివం మాస్టారు పుట్టినరోజు సందర్భంగా వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మందలపల్లి టి 10 క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆలపాటి శ్రీరామచంద్ర ప్రసాద్, కె వి సత్యనారాయణ, కోయిల అచ్యుతరావు, పర్వతనేని ప్రసాద్, గోపి శాస్త్రి, ఎంపీపీ సోయం ప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

### - నాలుగు గంటలు నిలిచిపోయిన ట్రాఫిక్

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మండల పరిధిలోని నారవారిగూడెం సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ సుంకి రమేష్ (42) మృతి చెందాడు. రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన లో లారీడ్రైవర్ రమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో సుమారు నాలుగు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సిఐ జితేందర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీను, సాయికిషోర్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి వెళ్లి మూడు జెసిబిల సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను పక్కకు లాగి నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. సుమారు నాలుగు గంటల పాటు వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఇటు జిలుగుమల్లి అటు మందలపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలిచిపోయాయి. మృతి చెందిన రమేష్ మృతదేహాన్ని పంచానామా కోసం మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



# కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టండి

**ప్రజాపక్షం/సుజాతనగర్:** కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గూగులోత్ వంశీ డిమాండ్ చేశారు. ఫీజు దోపిడిని అరికట్టాలని, విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి జుంకీలాల్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వంశీ మాట్లాడుతూ విద్యా సంవత్సరం పునః ప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాక విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ మొత్తం తమ దగ్గరే కొనాలని షరతులు పెడుతున్నారని వాటిని తమ ఇష్టానుసారంగా అధిక రేట్లకు అమ్ముతున్నారని తక్షణమే ఈ అమ్మకాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్ సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాణోత్ బాలాజీ, వినయ్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రభుత్వ అధికారులమంటూ ఫేక్ కాల్స్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసే ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని సిఐ జితేందర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని పలు వ్యాపారులకు ప్రభుత్వ అధికారులమంటూ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అంటూ లైసెన్స్‌లు తీసుకోవాలని డబ్బులు డిమాండ్ చేసిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇటువంటి ఫేక్ కాల్స్ వస్తే స్పందించకుండా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని చెప్పారు. ఫేక్ కాల్స్‌తో భయపడి మోసపోకుండా నిబంధనలకనుగుణంగా వ్యాపారాలు నిర్వహిస్తూ తగిన లైసెన్స్‌లు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

# పేటలో భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను అశ్వారావుపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రింగ్ రోడ్డు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భట్టివిక్రమార్క సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొగలపు చెన్నకేశవరావు, పాషా, రమేష్, జల్లిపల్లి దేవరాజు, బోసి పాండురంగ, సత్యవరపు బాలయ్య, దాసరి నాగేంద్రరావు, రమాదేవి, జజ్జూరు దుర్గారావు, కొప్పుల శ్రీను, తగరం రాజేష్, బషీర్, వెంకన్న, బాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ నులి పురుగుల దినోత్సవం విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో అంగన్‌వాడి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం విజయవంతం చేయాలని కోరుతూ ప్రభుత్వాసుపత్రి ఎంపీడీవో కార్యాలయము, ఆరోగ్య ఉపకేంద్రములలో సమీక్ష సమావేశం జరిగింది. వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడి శాఖల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి విజయవంతం చేసేందుకు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్యాధికారులు నవ్య కాంత్, తభసుమ్‌లు, విద్యార్థులు పాఠశాలలు పాల్గొని సిబ్బంది సంఖ్య పై సమీక్షలు చేశారు. ఈ నెల 20వ తేదీన 119 సంవత్సరాలు ఉన్న విద్యార్థులకు అంగన్‌వాడి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో, కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఈ మందు గోలీలను వేయనున్నట్లు వైద్యులు తెలిపారు. 20వ తేదీన వేసుకోని వారికి 27వ తేదీ వేస్తామని వివరించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలందరికీ సగం మందు గోలి, రెండు సంవత్సరాలు పై బడిన 19 సంవత్సరాలు లోపు వారికి పూర్తి స్థాయి మందు గోలి వేస్తామని పేర్కొన్నారు. ఈ మందు గోలి పాఠశాలలోనే నమిలి మింగాలని ఇంటికి తీసుకెళ్లకూడదని వైద్యులు పేర్కొన్నారు. కావున జాతీయ నులి పురుగుల దినోత్సవం అధికారులు సిబ్బంది సహకరించి విజయవంతం చేయాలని కోరారు.



# శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ బోనకల్ :** గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఈ నెల 20న వైరా పట్టణంలో జరుగుతాయని, శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ పంతు నాయక్ కోరారు. బోనకల్‌లో సంఘం మండల సమావేశం గుగులోత్ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకి గిరిజన మహిళలపై హత్యలు, అత్యాచార సంఘటనలు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. పోడు రైతులపై అటవీశాఖ అధికారులు దాడులు దౌర్జన్యాలతో గిరిజన రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతులకు అండగా ఉంటానన్న మాటకు నిలబడి ఉండాలని, లేకపోతే పోరాటాలు తప్పవని అన్నారు. గిరిజన హక్కుల పరిరక్షణలో భాగంగా జరుగనున్న శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



**ప్రజాపక్షం/పినపాకః** విద్యుత్ షాక్ తో మహిళ మృతి చెందిన సంఘటన పినపాక మండలం మల్లారం గ్రామంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మద్దెల రమణమ్మ అనే మహిళ మల్లారంలో కరెంట్ స్విచ్ ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ పాస్ కావడంతో గమనించిన స్థానికులు హుటాహుటిన మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు

# ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/దమ్మపేటః** దమ్మపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్యప్రసాద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొని మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇలాంటి జన్మదినాలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, అత్తులూరి వెంకట్రామారావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, చిన్నశెట్టి యుగంధర్, చామర్తి గోపి శాస్త్రి , చిన్న శెట్టి చిట్టిబాబు, గుర్రం మల్లేష్ , చెక్కిరాల మల్లేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, భట్టి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, అంబేద్కర్ సెంటర్ నందు భట్టి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క జన్మదినం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తెలంగాణలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్తా, జిల్లా నాయకులు మొండితోక సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, కౌన్సిలర్లు కోన ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మొండితోక నాగరాణి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## గ్లోబల్ కంపెనీకి ఎంపికైన ప్రియదర్శిని విద్యార్థిని



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాపంచాయతీపరిధిలోని ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలలోని కంప్యూటర్‌సైన్స్ విభాగానికి చెందిన ఆసిఫాషైక్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ విభాగంలో పాకేజ్డ్ ఆఫ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌గా 11లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యింది. శనివారం కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు విద్యార్థిని అభినందించి మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచ మాంద్యం, ఉద్యోగ అనిశ్చిత్తి ఉన్నప్పటికీ, తమ విద్యార్థిని గ్లోబల్ కంపెనీలో ఉద్యోగం పొందడం అభినందనీయం అన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని,విద్య,వ్యాపారం ఇలా ఏదైన సరే కమిట్‌మెంట్‌తో గోల్‌ను అచ్చివ్‌కావాలన్నారు. అదేవిధంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, అకడిమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## ఘనంగా భట్టి పుట్టినరోజు వేడుకలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ భట్టి ఇంకెన్నో పుట్టినరోజు వేడుకలను చేసుకోవాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో వదిలేసి వెళ్లారని ఆరోపించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి కష్టారెడ్డి, భోజ్యా నాయక తుమ్మలపల్లి సురేష్, కోదుమూరు దయాకర్‌రావు, గోవింద్‌రెడ్డి, నరసింహారావు, ఉప్పతల ఏడుకొండలు, సంక శంకర్, బుంగ శ్రీను, లక్ష్మ ణరావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను ఆటంకాలు లేకుండా జరుపుకోవాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బక్రీద్ పండుగకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జరిగే బ్రకీద్ పండుగ సందర్భంగా ముందుగా ముస్లీం సోదర సోదరీమణులందరికీ ఈద్ ఉల్ అధా(బక్రీద్ పండుగ)శుభాకాంక్షలను తెలిపారు. వధ ఇచ్చే పశువులను తరలించే ముందు జాగ్రత్తలు పాటించి కొనుగోలు రహదారి పత్రాలను తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని మూడు మున్సిపల్, 23 మండలాల పరిధిలోని కబ్రస్తాన్ ఈద్గాలలో మజీద్‌లను పరిశుభ్రత శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, వాటర్, కుర్బానీ జీవాల కళేబరాల తరలించేందు ట్రాన్స్ఫోర్టేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నమాజ్ వేళల్లో, రాత్రివేళల్లో లా అండ్ ఆర్డర్ ఇబ్బంది కాకుండా కొన్ని మత విద్వేషాలు కలిగించే దుష్టశక్తుల నుండి లా అండ్ ఆర్డర్ కాపాడాలని పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

## పల్టీ కొట్టిన పంచాయితీ ట్రాక్టర్

### -తీవ్రంగా గాయపడిన కార్మికుడు



ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక గ్రామ పంచాయితీ ట్రాక్టర్ ప్రమాద శాత్తు పల్టీ కొట్టిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఈవిషయంపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సారపాక గ్రామ పంచాయితీలోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తీసుకువెళుతున్న ట్రాక్టర్ ప్రమాద శాత్తు భాస్కర్ నగర్ ప్రాంతంలో బోల్తా కొట్టింది. ట్రాక్టర్‌కు ఉన్న ట్రాలీ రోడ్డు పక్కనకు పడిపోవడంతో ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న పంచాయితీ కార్మికుడు రవి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో కార్మికుడి చేతి వేళ్ళు నుజ్జు అవ్వడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గ్రామ పంచాయితీ కార్మికుడు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న గ్రామ పంచాయితీ ఈవో మహేష్ హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం మెరుగైన వైద్య సేవ కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# ప్రజలకు అండగా నిలిచేది ఎర్రజెండానే..

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి**
**- బిఆర్‌ఎస్ నుంచి సిపిఐలోకి 20కుటుంబాలు చేరిక**





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : అధికారం ఉన్న లేకపోయినా ఎర్ర జెండా నీడలో ప్రజల పక్షాన అండగా నిలుస్తున్నామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులోని బిఆర్‌ఎస్ పార్టీ నుంచి 20కుటుంబాలు బిఆర్‌ఎస్ నాయకుడు బుద్ధి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ నాయకుడు దండి రంగారావు సారధ్యంలో పార్టీలో చేరాయి. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడారు...ఇక్కడ పనిచేస్తున్న భారతకమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని చూసి ఎంతో మంది స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్నారన్నారు. అంతేకానీ అధికార పార్టీని అడ్డం పెట్టుకుని ప్రలోభాలకు గురి చేస్తూ ఊకదండపుడు హామీలు ఇచ్చి జెండాలు మార్పించుకున్న సంస్కతి తమది కాదన్నారు. రాబోయే రోజులు యుతరానివేనని నీతి, నిజాయితి, నిబద్ధతో ప్రజల మన్ననలను పొందాలన్నారు. పార్టీలో కష్టపడి బలోపేతానికి కృషి చేసిన వారికి తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. అనంతరం పార్టీలో చేరిన బుద్ధి రాధాకృష్ణ, జానకిరాములు, అప్పారావు, రవి, వీరనాగులు, అంజి, రాము, ఉప్పన్నయ్య, రమణ, వెంకన్న, చిన్న వెంకన్న, రామయ్య, సహదేవ్, రాంకోటయ్య, కృష్ణయ్య, రామయ్యలతో పాటు పలు కుటుంబాలకు దండి సురేష్ పార్టీ జెండాను కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మండల సమితి సభ్యులు మామిడి శంకర్‌రెడ్డి, వెన్నం భాస్కర్, రామిడి రమేష్, వెంపటి సురేందర్, కోట శ్రీనివాస్‌రెడ్డి, వెంపటి వెంకన్న, గణపరపు నాగయ్య, వీరన్న, దొంతగాని వెంకన్న, మేళ్లచెర్వు రవి, బుద్ధి నాగేశ్వరరావు, దండి రమేష్, రజబెల్లి, రమేష్, నాగరాజు, ఏఐటియుసి నాయకులు మేళ్లచెర్వు గురవయ్య, ఏర్పుల బ్రహ్మం, టేబహ్మం శ్రీను, పొన్నెకంటి చక్రవర్తి, ఏర్పుల బాలకృష్ణ, వల్లబోయిన వినోద్, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, గణపరపు ఉపేందర్, పొన్నెకంటి అఖిల్, బియ్యాల రాజు, పానమాకులు కృపాకర్, పేరాల ఆనంద్, రెబ్బగొండ్ల గోపి, దైథా జేమ్స్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# సైరన్‌ల తొలగింపు షురూ..!

**- సిఐ రాజిరెడ్డి ఆదేశాలతో ఎస్ఐ కుసుకుమార్ తనిఖీలు**
**- ప్రజాపక్షం కథనానికి స్పందన..అభినందనలు తెలిపిన ప్రజలు**
**- గుట్టు చప్పుడుకాకుండా తొలగించుకున్న కొందరు నేతలు**






ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : నిబంధనలను గిరాటేసి పెద్దోడికి చట్టం...పేదోడికి చట్టం అన్నచందంగా మెతమోగుతున్న ప్రైవేట్ సైరన్‌ల పై ప్రజాపక్షం శుక్రవారం కథనాన్ని ప్రచురించిది. ఇది వాట్సప్, సోషల్‌మీడిమాతో పాటు గ్రామాల వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వాట్సప్ గ్రూపుల్లోనైతే కారుకు సైరన్ ఏర్పాటు చేసిన వారి పేర్లతో సహా బహిరంగంగా పెట్టారంటే సైరన్‌ల మోతలపై ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నారో ఇట్టే అర్థమవుతుంది. ఈ కథనంపై సిఐ రాజిరెడ్డి స్పందించి ఎస్ఐ కుసుకుమార్‌తో శనివారం కార్లను తనిఖీ చేపించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ... సైరన్‌ల ఏర్పాటుపై పోలీసు సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేపిస్తున్నట్టు తెలిపారు. కార్లకు సైరన్‌లు ఉంటే వాటిన తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయ వచ్చునని, ఒక వేళ ఫిర్యాదు చేసిన వారి పేరు బైటికి వెల్లడించడం జరగదన్నారు. ఎవరైన తమ పేరు తెలిసి పర్వలేదు అనుకుంటే వారి పేర్లను బహర్గతం చేస్తామన్నారు. అయితే కథనంపై కొందరు నేతల గ్రామాలలో నెలకొన్న పరిస్థితులతో తొలగించివేయగా... మరికొందరు మేము సైరన్ ఎక్కడ పెట్టారో పోలీసులకు ఎలా తెలుస్తుందంటూ బరితేగింపు మాటల్లు మాట్లాడుతుండటం విశేషం. కావున పోలీసులు జనరల్ వాహనతనిఖీల సమయంలో చెకింగ్‌తో పాటు, రాజకీయనాయకులు, రియాల్టర్లు, బడాబాబుల, గ్రామాల్లో ఆకతాయ వ్యవహారాలు కనబరిచే వారి కార్లపై దృష్టి పెట్టడం ద్వారా సైరన్లు పెద్ద ఎత్తున దొరకనున్నాయి.

# సీజనల్ వ్యాధులపై మండల స్థాయి సమావేశం



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయం నందు మోరంపల్లిబంజర్ పిహెచ్‌సి వైద్యురాలు ఎం లక్ష్మీ సాహితి అధ్యక్షతన సీజన్ వ్యాధులు, జాతీయ నూలిపురుగల నివారణ దినోత్సవంపై మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల, కీటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ నివారణలో భాగంగా ముందస్తుగా దోమల నివారణకై పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, యాంటీ లార్వా కార్యక్రమాలు, డ్రైనేజీల పరిశుభ్రపర్చుట, నీరు నిల్వ లేకుండా చూడటం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలను వివరించారు. అదే విధంగా ఈనెల 20వ తేదీన జాతీయ నూలి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ, పాఠశాల, జూనియర్ కాలేజీల నందు 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ 1 మాత్ర ఆల్‌బెండజోల్ 400 ఎంజీ మింగిచడం జరుగుతుందన్నారు. కాబట్టి ఐసిడిఎస్ సిడిపివో, మండల విద్యాశాఖాధికారి వారి పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ టీచర్లను సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్ధ్, ఎంపిడివో జములారెడ్డి, స్పెషల్ ఆఫీసర్, ఎంఈవో సమ్మయ్య, ఐసిడిఎస్ సిడిపివో ప్రమీలా, ఏపిఎం నాగార్జున, ఎంపివో సునీల్ శర్మ, సిహెచ్‌వో సోమ్లా నాయక్, హెచ్‌ఈవో రవి, పంచాయితీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ డా. ప్రియాంక ఆలా బదిలీ

**- నూతన కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్**



ప్రియాంక ఆలా



జితేష్ వి పాటిల్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడె ం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డా.ప్రియాంక ఆలా బదిలీ అయ్యారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ రానున్నారు. ప్రభుత్వం చేపట్టిన పదిలీల్లో భాగంగా రాష్ట వ్యాప్తంగా ఐఏఎస్‌ల బదిలీలు చోటు చేసుకున్నాయి. 2023 జూలైలో ఇక్కడికి వచ్చిన ఆలా ఏడాది కాలం పాటు సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎనికలతో పాటు గత మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారులు సమర్ధవంతంగా పనిచేశారు. అంతే కాకుండా భద్రాచలంలో జరిగే ముక్కోటి, సీతారాముల కళ్యాణ మహోత్సవాలను సైతం ఆమె దగ్గరుండి జరిపించారు. అధికారులను సమన్వయం చేయడంతో పాటు ప్రోత్సహిస్తూ పనులు చేయించారు. ప్రజాదర్భారులో ప్రజల నుండి అనేక వినతులు స్వీకరించిన ఆమె త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేశారు. నూతన కలెక్టర్ పాటిల్ కామరెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.

# మధిరలో మాయమవుతున్న ద్విచక్ర వాహనాలు..!

**- ఆందోళన చెందుతున్న వాహనదారులు**



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలో గడిచిన కొన్ని నెలలుగా ద్విచక్ర వాహనాలు మాయమవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో రెండు అంతకంటే ఎక్కువ ద్విచక్ర వాహనాలను కొంతమంది దొంగలు అపహరించుకుపోతున్నారు. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని డాక్టర్ రామనాధం ఇంటి ఎదురుగా కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ అద్దెకు ఉంటున్న ఆవుల కృష్ణ అనే వ్యక్తి శుక్రవారం రాత్రి సమయంలో బయటపెట్టిన వాహనం తెల్లవారే సరికి చూడగా వాహనం చోరీకి గురైందని తెలుసుకుని శనివారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురి కాగా బాధితులు ఫిర్యాదు చేయటం జరిగింది. మధిర పట్టణంలో గత కొన్ని నెలలుగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు రాత్రి పగలు తేడా లేకుండా జరుగుతున్నాయి. దొంగలను పట్టుకోవడంలో మధిర పట్టణ పోలీస్ వ్యవస్థ విఫలమైందనే ప్రచారం ప్రజల్లో నెలకొంది. నెలలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకున్నట్లు కన్పించకపోవటంతో ద్విచక్ర వాహనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికైనా పోలీస్‌శాఖ వారు మధిర పట్టణంలో ప్రధాన వీధుల్లో నిఘా ఏర్పాటు చేసి ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# వైభవంగా శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి 18వ వార్షికోత్సవం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ శివారు నర్సాపురంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి 18వ వార్షికోత్సవ మహోత్సవంలో మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనను పూర్ణకుంభంతో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ 5వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బజ్జూరు కృష్ణ, మరీదు నాగు, లగడపాటి భాస్కర్, బజ్జూరి కృష్ణ, గాదెగోని వెంకటేష్ గౌడ్, బజ్జూరి రాజేష్, వాడే శేషగిరి, బజ్జూరి నాగేశ్వరారావు తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి 18వ వార్షికోత్సవం సందర్భంగా తిమ్మంపేట గ్రామస్తులు పుష్పాల కృష్ణ వెంకటరమణ దంపతులు అమ్మవారి ఆలయానికి గోమాతను దానంగా అందజేశారు.

**హాజరైన ఎంఎల్‌ఏ ఆది నారాయణ...**



నరసాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి 18వ వార్షికోత్సవానికి అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో ఎంఎల్‌ఏ జారేతోపాటు నాగళ్ల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకరరావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐటిసి పేపర్ మిల్లుతో గోదావరి విషపూరితం

**-సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పున్నం చంద్**



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటిసి పేపర్ మిల్లుతో గోదావరి విషపూరితంగా మారుతుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డి పున్నం చంద్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గోదావరి నీరు కలుషితం కావడంతో పాటు అక్కడ గాలి విషపూరితంగా మారుతుందని, పర్యావరణ చట్టాలకు తూట్లు పొడుస్తూ ఐటిసి యద్ధేచ్ఛగా జల, వాయు కాలుష్యానికి పాల్పడుతున్నందని ఆరోపించారు. పారిశ్రామిక వ్యర్థ పదార్ధాలతో కూడిన కలుషిత జలాన్ని నేరుగా బూర్గంపాడు మండలంలోని రెడ్డిపాలెం వద్ద గోదావరిలోకి వదలడంతో గోదావరి తీర ప్రాంత వాసుల జీవితాలు దుర్భరంగా మారిపోయాయని తెలిపారు. మనుషులకే కాకుండా పశుపక్షాదుల మనుగడే కూడా ఈ నీటితో ప్రమాదం వాటిల్లుతోందని అన్నారు. వ్యర్థ రసాయనిక పదార్ధాలతో కూడిన విష వాయువును కర్మాగారం నుంచి వదలడంతో భద్రాచలం, బూర్గంపాడు ప్రాంత వాసులు క్యాన్సర్ వంటి అతి ప్రమాదకరమైన రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్న రాష్ట కాలుష్య నియంత్రణ మండలి కేవలం నోటీసులకే పరిమితం అవుతుందని విమర్శించారు. ఐటిసి వెంటనే సారపాక కేంద్రంగా వైద్యశాల లేనందున ప్రైవేట్ వైద్యశాల ఆశ్రయించి భారీగా నష్టపోతున్నారని తణ సమస్యను కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ స్కీంలో భాగంగా సారపాక కేంద్రంగా కార్పోరేట్ స్థాయి వైద్యశాల, అదే విధంగా సారపాక, బూర్గంపాడు బస్సు స్టాండ్ ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని, బస్సు స్టాండ్‌లో కూర్చోవడానికి బల్లలు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు.

## ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ బదిలీ



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ బదిలీ అయ్యారు. ఆయనను ప్రభుత్వం వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించింది. రాష్ట్రంలో చోటు చేసుకున్న ఐఏఎస్‌ల బదిలీల్లో జరిగాయి. ఐటిడిఏ పిఓగా గత ఏడాది జూలైలో ఇక్కడికి వచ్చిన ఆయన గిరిజన వికాసం పట్ల శ్రద్ధ పెట్టారు. గిరిజన విద్యను గాడిలో పెట్టడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేశారు. గిరిజనులకు ఆదాయం తెచ్చి పెట్టే విప్పచెట్లను ఐటిడిఏ ప్రాంగణంలో నాటి అందరి మన్ననలు పొందారు. మరో ప్రక్క గిరిజనుల ఫ్రిజ్‌గా భావించే సొరకాయ బుర్రలో మంచినీటిని తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చాటి చెప్పారు. గడిచిన అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సమర్ధవంతంగా పనిచేశారు. మరో ప్రక్క భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి, ముక్కోటి ఉత్సవాల విజయవంతానికి కృషి చేశారు.

## మనుగడను కాపాడుకోవడం చాలా మంచిది



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసీ గ్రామాల్లో మసకబారుతున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఆదివాసీ సకల కళాపరిషత్ ఏర్పాటు కావడం సంతోషదాయకమని ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం ఐటిడిఏలోని ఛాంబర్‌లో ఆదివాసీ సకల సంక్షేమ సంఘం డైరెక్టర్ కల్లె శ్రీధర్ బృంధం పిఓను మర్యాద పూర్వకంగా కలిశారు. అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల పట్ల కళా నైపుణ్యాన్ని పెంచే విధంగా కృషి చేయడమే కాక దీనిపై డాక్యుమెంటరీ తయారు చేసి భావి తరాలకు అందించే ఉద్దేశ్యంతో ముందుకు రావాడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఓ గురుకులం వెంకటేశ్వరరాజు, సంఘం రాష్ట్ర కార్యదర్శి సోయం విక్రం, ఐటిడిఏ మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, ఆనంద్, తిరుపతి, అభిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు




ప్రజాపక్షం/భద్రాచలం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఏ పొదెం వీరయ్య కేక్ కట్ చేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం లో అధికారంలోనికి వచ్చేందుకు ఆయన చేసిన పాద యాత్ర అమోఘమైందన్నారు. కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేసి గాడిలో పెట్టి అందర్నీ కలుపుకుంటూ పని చేశారని చెప్పారు. ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతిర్యాల రవికుమార్, రౌతు నర్సింహారావు, బంధం శ్రీనివాసగౌడ్, చింతిర్యాల సుదీర్, వాసిరెడ్డి సాంబశిరావు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. అపోలో ఫార్మసి, సాయి అంజనా మోటార్స్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయి. మొత్తం 220 మంది హాజరు కాగా 102 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి అక్కడికక్కడే నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధికల్పన అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు రావడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం చాలా విరామం తర్వాత జాబ్ మేళా ఏర్పాటు చేశామని, చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషదాయకం అన్నారు. ఇక నుండి ప్రతీ నెల జాబ్‌మేళా నిర్వహిస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ ఉద్యోగ అవకాశాలు వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో అంబేద్కర్ వాసి నవీన్ మృతి



**మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి: షేక్ సాబీర్‌పాషా**

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** చుంచుపల్లి మండలం పెనగడప అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన ఇనుముల నవీన్(35) శుక్రవారం రాత్రి చుంచుపల్లి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో నవీన్ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని, యజమానికి కోల్పోయిన కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, కౌన్సిలర్లు యూసుఫ్, సత్యనారాయణాచారి ఉన్నారు.

# కరకగూడెం మండలంలో వనభోజనాల సందడి

**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలుగు వారి వన భోజనం సందడి చేసింది. మనం మరిచిపోతున్న సంప్రదాయాన్ని గుర్తు చేస్తూ కొత్త అనుభూతులు రుచి చూపింది. ప్రకృతి ఒడిలో ఆటలాడుతూ, సేద తీరుతూ శనివారం ఆద్యాంతం ఆస్వాదించేలా చేసింది. ఏటా వేలాది మందితో వనభోజనాలు బతుకమ్మ పండుగను విశేషంగా నిర్వహిస్తూ ప్రపంచ వ్యాప్తంగా గల తెలుగు ప్రజల దృష్టిని ఆకర్షించిన వనభోజనాలు ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చింది. కరకగూడెం మండల పరిధిలోని తాటిగూడెం, పద్మాపురం, అనంతారం, బర్లగూడెం, బట్టుపల్లి, చిరుమళ్ల, రేగుళ్ల, కొత్త గూడెం, గొల్లగూడెం గ్రామ ప్రజలు అడవి ఈ ప్రాంతానికి వెళ్లి వన భోజనాల సందడి చేశారు. ప్రతి గ్రామం నుండి, ప్రతి ఇంటి నుండి అందరూ నాటు మేకలతో భోజనాలు సందడి చేసుకుని తిరిగి ఇళ్ళకి వస్తారు. వనభోజనాల వేడుక ఆరంభంలో స్థానిక కళాకారుల బృందం ప్రదర్శించిన నాటు డాన్స్ ఉర్రూత లూగించింది. అనంతరం తెలుగు వారందరూ నాటు డాన్స్ ఎంజాయ్ చేశారు. ఉత్సాహంగా పిల్లలు పతంగులను ఎగురవేశారు. భోజనాలు, ఆటపాటలతో పాటు ఆటలను ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్, మాజీ ఎంపిటిసి దుర్గం సంజీవ, మండల అధ్యక్షులు జాడి రవికుమార్, నియోజకవర్గ అధ్యక్షులు దుర్గం శరత్, సురేందర్, మహిళా యూత్ ప్రెసిడెంట్ జాడి సరిత, దుర్గం స్వాతి, గ్రామ యూత్ లీడర్స్ ప్రవీణ్ , సందీప్, జస్వంత్, దినేష్, ప్రశాంత్, వంశి, సంగీత్, గ్రామ కమిటీలు దుర్గం రాణి, రామటెంకి మనీషా, జాడి దీపిక, జిమ్మిడి సరిత, జ్యోతి, రామటెంకి విమల, దుర్గం మౌనిక, లావణ్య, దుర్గం సుష్మ, జిమ్మిడి రాధ, రామటెంకి సంధ్యారాణి, వీరలక్ష్మి , జాడి కళ్యాణి, గాంధర పూజా, జాడి మంగవేణి, జనంగం అలివేలు, జాడి నిరోషా, దుర్గం జాడి దీపిక, దురంగ, మండల గ్రామస్తులు తదితరులు నిర్వహించారు. వన భోజనాల అనంతరం వ్యవసాయ పనులను ప్రారంభించారు.



# శ్రీచైతన్యలో ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లుపంచాయతీపరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్‌కాలేజీలో అంబెస్ట్ టెక్నాలజీస్ వారి సౌజన్యంతో బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండురోజులపాటు జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ శ్రీ మల్లంపాటి శ్రీధర్ హాజరయ్యి మాట్లాడారు...విద్యార్థులు పరిస్థితులకు అనుకూలంగా వారి నైపుణ్యాలను, అభివృద్ధి చేసుకోవాలన్నారు. దానిలో భాగంగానే ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు లిస్ప్, ప్రోలాగ్, సయస్విప్ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్‌ను విజయవంతం చేసిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల సిఎస్‌సిహెచ్ఓడి డాక్టర్ సుదర్శన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, కళాశాల సిఈఓ శ్రీనివాస్, అధ్యాపకులు సదాలక్ష్మి , సతీష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి పుట్టిన రోజు వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా శనివారం మండలం లోని రాయగూడెం లో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన సెంటర్ లో తొలుత కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు మాట్లాడారు..భట్టి ముందుముందు మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోరకు పని చేసే గొప్ప నాయకుడు అన్నారు. భట్టి పుట్టిన రోజు సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరేపల్లి రవి, బల్లి వీరయ్య, బోయిన నాగరాణి, కవిత, నాగమణి, మట్టమ్మ, కనకమ్మ, వీరబాబు, చందర్‌రావు, వెంకయ్య, గోపయ్య, జానిమియా, ప్రసాద్, కోటేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ టెండర్‌ను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** స్థానిక బస్టాండ్ స్థలం టెండర్ ప్రకటన ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు... దాతలు ఇచ్చిన స్థలం ను గత పాలకులు లీజ్‌కు ఇవ్వటం దారుణం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడ అదే తప్పు చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ స్థలం ను ప్రయాణికుల సౌకర్యార్థం ఉంచాలని కోరారు. టెండర్ ను వెంటనే నిలిపివేయక పోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బస్టాండ్ లో సమస్యలు పరిష్కరించ లేని అధికారులు స్థలం లీజ్ కు ఇవ్వటం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పగిడికత్తుల రామదాసు, చిర్రా బిక్షం, డి.రామదాసు, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిటివో, భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కిషన్‌రావు మోరంపల్లిబంజర్ గ్రామంలో శనివారం క్షేత్రస్థాయిలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. స్కూల్ బస్సులలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా నిబంధనలకు అనుగుణంగా ఫిట్నెస్‌తో కలిగి ఉండాలని పాఠశాలల, కళాశాలల యాజమానులను హెచ్చరించారు. అలాగే స్కూల్ బస్సు నడిపూ డ్రైవర్‌కు ఖచ్చితంగా లైసెన్స్ ఉండాలని, నిబంధనలను పాటించాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని హెచ్చరించారు. అన్ని రకాల వాహనాలు తనిఖీలు చేసి సరైన పత్రాలు ఉన్నాయా లేవా ఇన్సూరెన్స్ తదితర పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# హామీలపై ప్రభుత్వం ముందుకు వెళ్లాలి

**ప్రజాపక్షం/కరకగూడెం:** రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా కూడా రైతులకు ఇచ్చిన హామీలు (అన్ని వడ్లకు బోనస్, ఒకేసారి రుణమాఫీ, సీజన్ వారీగా రైతు భరోసా), మహాలక్ష్మి పథకం (మహిళలకు నెలకు 2500,), పెన్షన్ 4000 రూపాయలు ఇలా ముఖ్య మైన హామీలు నెరవేర్చాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చందా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందరోజుల పాలన వరకు అన్ని హామీలు నెరవేస్తామని చెప్పిన ప్రభుత్వం వాటిని నెరవేర్చాలని లేనిచో దీనిపై తెలుగుదేశం పార్టీ స్పందిస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



# ముజ్జుగూడెం సబ్‌స్టేషన్ కెపాసిటి పెంపు

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండలంలోని ముజ్జుగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారుల సౌకర్యార్థం కెపాసిటి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ముజ్జుగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ 3.15 కెపాసిటి మాత్రమే ఉంది. కాగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలో అసాసాగారం, ముజ్జుగూడెం, గువ్వలగూడెం, సదాశివాపురం, ఆచార్లగూడెం తదితర గ్రామాలలో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో సబ్‌స్టేషన్ కెపాసిటి 5 మెగావవర్ కెపాసిటిని పెంచారు. వినియోగదారుల సమస్యను తీర్చేందుకు అధికారులు కెపాసిటి పెంచారు. దీంతో ఈ ప్రాంతం లోని విద్యుత్ సమస్యలు లోడ్ సమస్య తీరుతుంది. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, బీ.పవార్, ఏడీ లు కోట్యానాయక్, రామదాసు, రాజారత్నం, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.



# ఏసీ మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం లో నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపాలని ఏసీలో నిల్వ ఉన్న మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని మండల కాంగ్రెస్ నాయకులు దొడ్డ గురవయ్య అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కువగా రైతులు వ్యవసాయ మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఎక్కువ విస్తరణలో మిర్చి పత్తి పంటలను సాగు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన విత్తన కంపెనీ వారు రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తనాలను కల్తీ పురుగు మందులు సరఫరా చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రత్యేక చొరవతో నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శీతల గిడ్డంగుల్లో ఉన్న మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని 25 వేల ఉన్న మిర్చి ధర 11 వేలకు దిగజారిందని మిర్చి రైతులను వెంటనే ఆదుకోవాలని ఆయన కోరారు సన్న చిన్న కారు రైతులకు రాయితీలపై వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దొడ్డ గురవయ్య కాంపాటి వీరయ్య, టెంకటి వెంకటేశ్వర్లు, జాల మల్లయ్య, బండి వీరయ్య, జాల వెంకటనారాయణ, కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/కల్లూరు:** విద్యుత్తు లైన్ల మరమ్మత్తులలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి గణేష్ తెలిపారు. కావున టౌన్ 1 ఫీడర్ పరిధిలో ఉన్న 3000 మంది వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా వినియోగదారులను కోరారు.

# వామ్మో ఇంత రేటా..!

**-పాఠ్య పుస్తకాలు, యూనిఫాం రేట్లను చూసి హడలెత్తుతున్న తల్లిదండ్రులు**
**- మధిరలో ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం**
**- యథేచ్ఛగా స్కూళ్ళలో పుస్తకాలు, దుస్తులు విక్రయం**
**- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**








**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లి దండ్రులను అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్లల్లో పాఠ్యపుస్తకాలు, ఏక రూప దుస్తులను అధిక రేట్లకు అమ్ముతూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కేవలం పాఠ్యపుస్తకాలు, యూనిఫాం రేట్లను చూసి తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. జూన్ 12వ తేదీ నుండి విద్యాసంవత్సరం ప్రారంభం కావటంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం వేలరూపాయల్లో అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అమ్ముతూ వాటిని కొనాలంటూ ఒత్తిడికి గురిచేస్తుండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు అనేక అవస్థలు పడుతున్నారు. 1వ తరగతి విద్యార్థులకు రూ.5వేల నుండి పై తరగతుల విద్యార్థులకు రూ.10వేల వరకు కేవలం పుస్తకాలకు వసూలు చేస్తున్నారు. ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు పుస్తకాలు, యూనిఫాం కొనాలంటే వేలరూపాయలు అవుతుండడంతో రేట్లను చూసి వమ్మో ఇంత రేటా అంటూ మిన్నకుండిపోతున్నారు. ఇందేటని ప్రశ్నిస్తే ఖచ్చితంగా పుస్తకాలు మా పాఠశాలలోనే కొనాలని, తమది ప్రత్యేకమైన కూడిన సిలబస్ ఉంటుందని చెబుతున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లల్లో పాఠ్య పుస్తకాలు, దుస్తులను అమ్ముతున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలకు తావిస్తుంది. అలాగే స్కూళ్లల్లో అమ్మే పాఠ్యపుస్తకాలపై ఎలాంటి తయారీ రేటు లేకపోవడం, అమ్మిన రశీదులు ఇవ్వకుండా తమకిష్టమొచ్చిన విధంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్లల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులు వంటివి విక్రయించరాదని, అమ్మకాలు చేయరాదని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని బేఖాతర్ చేస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేసి అందులో ఒక ఉపాధ్యాయుడిని, ప్రధానోపాధ్యాయుడిని, పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్, ఇద్దరు పేరెంట్స్‌ను నియమించి గవర్నింగ్ బాడీ ద్వారా ఫీజులు ఎంత వసూలు చేయాలో నిర్ణయించి ఆ ఫీజుల వివరాలను అందరికి కన్పించేలా పట్టికపై ఉంచాలి. కాని గవర్నింగ్ బాడీలో పాఠశాల యాజమాన్యానికి అనుకూలమైన వారిని సభ్యులుగా చేర్చి గవర్నింగ్ బాడీ తతంగాన్ని మమ అనిపిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ధరలకు పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన మహిళా హోంగార్డ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన బి. సంధ్యా రాణి మహిళా హోంగార్డు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువతో శనివారం ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని ఇన్‌వర్డ్ సెక్షన్‌లో బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమిషనర్ కొనియాడారు. రిటైర్‌మెంట్ తన వృత్తికే కాని తన వ్యక్తిత్వానికి కాదని మీ విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి సుశీల్ సింగ్, హోంగార్డ్ ఆర్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ దత్తురాం, హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీ నీరజ, హోంగార్డ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు






**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను యువజన కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీలోని ముక్తాబాయ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతి అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో పేదల సమస్యల ప్రజాగొంతుకగా ప్రభుత్వంపై పోరాడిన మల్లు భట్టివిక్రమ్కా సీఎల్పీ నేతగా పార్టీని కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తెచ్చేందుకు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేరుతో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకుంటూ తామున్నామన్న అభయ హస్తం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, కొత్తగూడెం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గద్దం రాజశేఖర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు అజ్మీర సురేష్‌నాయక్, 29వ వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, కొత్తగూడెం టౌన్ ఓబిసి అధ్యక్షుడు అమడగాని జయ ప్రకాష్, కొత్తగూడెం టౌన్ మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, యువజన కాంగ్రెస్ సెక్రటరీ దావూద్, ప్రశాంతినగర్ పంచాయతీ ఉప సర్పంచ్ ఆఖరి కొమరయ్య, వినయ్, ఎడ్ల ఏలియా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హుస్సేన్, ఏలూరి రాందాస్, ఎలకపల్లి లక్ష్మయ్య, హరిసింగ్, మల్లేష్, గోవర్ధన్, జనార్ధన్, రామగిరి లక్ష్మణాచారి, షేక్ నిసార్, రామారావు, రవికుమార్, యువజన నాయకులు, నరాల రాజేష్, దేవరపల్లి, వంశీ, దీపక్, సందీప్, మహేష్, విజయ్, పానవాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సిఎం భట్టి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు సందర్భంగా గొల్లపూడి గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో భట్టివిక్రమార్క పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేసి వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ మేదూరి రామారావు, షేక్ సైదా, మిట్టపల్లి సతీష్, ఈలప్రోలు వెంకటప్పయ్య, సురేష్, రాంబాబుఉ, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెబ్బవరంలో భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలు రెబ్బవరంలో ఘనంగా గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, నాయకులు గుత్తా రామారావు, మాజీ సర్పంచ్‌లు ఆకుల రమేష్‌బాబు, సాదం రామారావు, చట్టి రామకృష్ణ, షేక్ ఖాసిం, గుత్తా సిద్దు, పసుపులేటి హనుమంతరావు, గుత్తా శ్రీను, దారా దాసు, వేల్పుల పెద్దబ్బాయి, దొబ్బల క్రిష్ణ, వేల్పుల వినోద్, తాటికొండ నాగేశ్వరరావు, గుత్తా నాగేశ్వరరావు, సిలివేరు సీతయ్య, మొల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకులు మిట్టపల్లి రామ్మూర్తి మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల:** కొణిజర్ల మండలం గోపారం సిపిఐ సీనియర్ నాయకులు మిట్టపల్లి రామ్మూర్తి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. వారి మరణ వార్త తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర రైతులు ఖమ్మం జిల్లా అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ కార్యదర్శి స్వర్ణ రమేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు సామినేని సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు తండు సోమయ్య, సిపిఐ నాయకులు మిడియాల వెంకటి, జామతా మాతంగి బిక్షం, కృష్ణయ్యలు మిట్టపల్లి రామ్మూ_ మృతిదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. మిట్టపల్లి రామ్మూర్తి చివరి ప్రాణం వరకు సిపిఐ పార్టీ కోసం పేద ప్రజల ప్రయోజనాల కోసం పోరాడిన నిబద్దత కలిగిన త్యాగజీవి రామ్మూర్తి అని వారు కొనియాడారు. రామ్మూర్తి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని వారు కోరారు. రామ్మూర్తి మరణం పట్ల జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## ప్రభుత్వ నూతన అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలం వినాయకపురం పిహెచ్‌సికి ప్రభుత్వం కేటాయించిన నూతన అంబులెన్స్‌ను శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన అంబు లెన్స్ ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆసుప్రతిని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. నూతన అంబులెన్స్ సేవలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ప్రజాపక్షం/దమ్మపేట:** మండల పరిధిలోని నాగుపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను దమ్మపేట పోలీస్‌లు అదుపులోకి తీసుకోగా, నలుగురు వ్యక్తులు అక్కడ నుండి పారిపోయారు. పట్టుబడిన వ్యక్తుల వద్ద నుండి 12,140/ రూపాయల నగదు, ఎనిమిది మోటార్ సైకిళ్ళు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

## సైబర్ నేరగాళ్లు పంపిస్తున్న

# లింకులు, మెసేజ్‌లకు స్పందించవద్దు : సిపి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐ యూనో అప్లికేషన్స్ ఉపయోగిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు పంపిస్తున్న లింకులు, మెసేజ్ లకు స్పందించి మోసపోవద్దని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ బ్యాంక్ అయినా అప్‌డేట్ కోసం వివరాలు అడగవని, మోసపూరిత మెసేజ్‌లతో వచ్చిన లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు డేటాలో ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా మీ ఖాతాలో రివార్డు నగదు జామ అవుతుందని, మీ కెవైసి అప్‌డేట్ కాలేదని, మీ ఎస్‌బిఐ యోనో ఖాతాల్లో బ్లాక్ అయిందని, అన్ బ్లాక్ కోసం పాన్ కార్డ్ నెంబరు లింకులో నమోదు చేస్తే అప్‌డేట్ అవుతుందని మెసేజ్ పంపిస్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. మెసేజ్ లకు స్పందించి లింక్ ఓపెన్ చేసిన బాధితుల యూజర్ ఐడి, పాస్ వర్డ్ ఎంటర్ చేసిన అనంతరం వచ్చిన ఓటిపి ఎంటర్ చేయడంతో 60 శాతం అప్‌డేట్ అయిందని తర్వాత పాన్ నెంబరు ఎంటర్ చేయగా 70 శాతం అని చూపిస్తుందని ఆ తర్వాత మళ్లీ ఓటిపి రావడంతో ఓటిపి ఎంటర్ చేయడంతో 90 శాతం చూపించి కొద్ది సేపటి తర్వాత 100 శాతం అప్‌డేట్ అయినట్లుగా చూపిస్తుందని తెలిపారు. 100 శాతం అప్‌డేట్ చూపగానే విడతల వారీగా బాధితుని ఖాతా నుంచి నగదు కట్ అయినట్లుగా మెసేజ్ వస్తుందని తెలిపారు. దీంతో డబ్బులు పోయినట్లు తెరుకుంటున్న బాధితులు తాము మోసపోయామని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఏదో ఆశ చూపి వల వేస్తుంటారని గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లో మాట్లాడి ఏదైనా స్కీమ్ గురించి చెబితే అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెం.1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే నగదును రికవరీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# భూ వివాదంలో మారణాయుధాలతో దాడి





**ప్రాణాపాయస్థితిలో బాధితుడు గుగులోతు వీరన్న**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** భూ వివాదంలో మారణ ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ప్రాణాపాస్థితిలో యువ రైతు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉన్నత విద్యను అభ్యసించి తనకున్న భూమిలో వ్యవసాయం పండించేందుకు యువ రైతు ఆరాటపడుతున్న సమయంలో పక్క చేను గేట్ వారి మధ్య వివాదం చెలరేగి మారణ ఆయుధాలతో దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని బాలాజీ నగర్ తండా గ్రామ పంచాయతీ లో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం వెదుళ్ల చెరువు రెవెన్యూ పరిధిలో గుగులోతు వీరన్నకి తన తండ్రి ద్వారా వచ్చిన వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పక్క చేనుగెట్టు రైతులు వీరన్న గెట్టు ను ధ్వంసం చేయగా వీరన్న స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. తాసిల్దార్ కార్యాలయంలో మీ సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా స్థానిక ఎస్సై గిరిధర్ రెడ్డి సూచించగా ఎస్ఐ మాటలు పట్టించుకోకుండా అదే గ్రామానికి చెందిన ధరావత్ రామచంద్రు ధరావత్ నాగరాజు ధరావత్ వెంకన్న ధరావత్ పంతులు సరోజ మహేష్ వీరన్న పై నువ్వు మాపై అక్రమ కేసులు పెట్టావని దౌర్జన్యంగా మారన ఆయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీరన్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆటో ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. బాధితులు పోలీస్ స్టేషన్లో సామరస్యంగా వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిందిగా విన్నవించగా దౌర్జన్యంగా దాడి చేసి ఎప్పటికైనా నిన్ను చంపుతామని బెదిరించారని బాధితులు ఆరోపిస్తున్నాడు. వీరన్న పై దాడి చేసిన వారిపై కఠినంగా హత్య ప్రయత్నం కింద కేసు నమోదు చేసి బాధ్యుడికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.

# పోడుదారుల సమస్యను పరిష్కరించరా..?



**ప్రజాపక్ష/కారేపల్లి:** మండలంలోని ఎర్రబోడు గ్రామపంచాయతీ ఊట్కూరు బీట్ పరిధిలో పోడు సాగుదారులు నిద్రాహారాలు మాని ప్లాంటేషన్ పరిధిలోనే నిరసనలు వ్యక్తం చేసిన నేపద్యంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ హామీ మేరకు ఎన్నికల కోడ్ అయిన తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో నిరసనను విరమించుకున్న విషయం విధితమే. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపద్యంలో తమ పోడు భూముల సమస్యలు కూడా అనంతరం పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఏళ్ల తరబడి పోడు భూములే జీవనాధారంగా జీవిస్తున్న గిరిజనులు నిరసనలు విరమించుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసి దాదాపు పక్షం రోజులు అయిన్పటికీ ఆ ఊసే లేకుండా పోయిందని పోడు సాగుదారులు వాపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పోడు భూములే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న గిరిజనులకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనే ధ్యేయంగా ఏర్పడిన నూతన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తారని, గెలిపించామని గుర్తు చేశారు. ఇటీవల నల్లగొండ జిల్లా పోడు భూముల సమస్యలను పరిష్కరించి పోడు భూములకు పట్టాలు ఇవ్వడమో లేదా ప్రత్యామ్నాయం చూపించడం చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఎంతోమంది అమరుల ఉద్యమాలు పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు భావించిన కెసిఆర్ ప్రభుత్వం పోడు భూముల సమస్యలపై మాటలతో కాలయాపన చేసింది తప్ప చేసిందేమి లేదని పోడు భూముల్లో ప్లాంటేషన్ పేరా తమ భూములను లాక్కొని హరితహారం పేరా మొక్కలు నాటి పోడు సాగుదారుల గిరిజనుల పొట్ట కొట్టిందే గాని చేసిందేమి లేదని అందుకే అందరూ కలిసికట్టుగా కెసిఆర్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రజాపాలన ధ్యేయంగా ముందుకు సాగిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించామని గిరిజనులు పేర్కొంటున్నారు. అతి సమీపంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపద్యంలో పోడు సాగుదారుల సమస్యలు పరిష్కరించకపోతే వారికి ఓటుతోటే సమాధానం చెబుతామని పోడు సాగుదారుల గిరిజనులు కల్తీ అరుణ, మల్లమ్మ, కరపతి అరుణ, నాలి సుగుణ, భూక్యా రమేష్ హెచ్చరిస్తున్నారు. పోడు భూములపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు ప్రాణభయం కలిగేలా నిరంకుశంగా ప్రవర్తిస్తున్న నేపద్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి పోడు భూముల్లో ప్లాంటేషన్ చేయకుండా పోడు భూములకు పట్టాలిచ్చి తమ జీవనాధారాన్ని కొల్లగొట్టకుండా పట్టాలు ఇవ్వాలని, లేదా ప్రత్యామ్నాయం చూపించాలని గిరిజన పోడు సాగుదారులు కోరుతున్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సమక్షంలో పోడు సాగుదారులకు న్యాయం చేస్తానని అటవీశాఖ అధికారులతో మాట్లాడతామని, ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపద్యంలో ఫోన్‌లో హామీ ఇచ్చినట్లుగా పోడు సాగుదారుల గిరిజనుల పట్టాలు లేదా ప్రత్యామ్నాయం చూపించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల కేంద్రమైన ఏన్కూరులో శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు స్వర్ణ నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అనంతరం మండల అధ్యక్షులు నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీప్రకారం ఆగస్ట్15లోగా అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మేడా ధర్మారావు, లాలునాయక్, మహిళా మండల అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతిరెడ్డి, భూక్యా చందూలాల్‌నాయక్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఈవూరి సైదులు, మాలోతు నర్సింహారావు, లచ్చిరామ్‌నాయక్, బానోతు రామారావు, రోహిత్‌సాయి, సక్రునాయక్, పంతగాని నరేష్, నన్నేఖాన్, కట్టా సత్యనారాయణ, నల్లమల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భట్టి పుట్టినరోజు వేడుకలు






**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టీవిక్రమార్క పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిరంతరం పేదల గురించి బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించే వ్యక్తి భట్టీ విక్రమార్క అని ఎప్పుడు కూడా ఆయన పేదల గురించి ఆలోచించే వ్యక్తి అని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంలో కీలకపాత్ర పోషించారని ఆయన ఎప్పుడు కూడా సుఖశాంతులతో ఉండాలని, పుట్టినరోజు సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్రాభివృద్ధికి, ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నం రాజశేఖర్ అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సత్యనారాయణ ఎంపీటీసీ పాప నాయక్ అంబేత్కర్ మండల కాంగ్రెస్ నాయకులు పొట్ల కిరణ్ పత్తి నాగేశ్వరావు, నిరుడు లాజర్ ఎన్.రాములు, షకీల్, నర్సయ్య, రమేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**- 8 మంది మావోయిస్టులు మృతి, 1 జవాన్ మృతి**

**- ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు - మృతుల సంఖ్య పెరిగే అవకాశం**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ అబూజ్మడ్ కేంద్రంగా పోలీసులు, మావోయిస్టుల మధ్య గత రెండు రోజులుగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు హతమవగా, ఒక జవాన్ మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లాలో గత రెండు రోజులుగా సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, ఐటిబిపి బలగాలు అడవులను చుట్టుముట్టాయి. ఛత్తీస్‌గఢ్ వర్షాలు పడుతుండటంతో మావోయిస్టులు స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. వారి జాడ కనుక్కొని నలువైపుగా దిగ్భంధం చేశారు. విషయం తెలుసుకున్న మావోయిస్టు పార్టీ ఎదురు కాల్పులు జరిపింది ఆత్మరక్షణ కోసం బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. ఇరు వర్గాల మధ్య రెండు రోజులుగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృత దేహాలను స్వాదీనం చేసుకున్న పోలీసులు హెలీకాప్టర్‌లో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయాలపాలైన జవాన్లను సైతం మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి పంపారు. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.